TGTEL/25/A0827

# ప్రజా దివాన్

తెలుగు దినపత్రిక

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలని అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 1 సంచిక :139 prajadivvs57@gmail. com మంగళవారం 31, మార్చి 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-

## బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

**- బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా**



: బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శాసనమండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు.

మిగతా2లో...

## మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్..

- లొంగిపోయిన మవోయిస్ట్ నారాయణరావు
- వారికి పరిహారం అందిస్తామన్న డిజిపి
- ఎపి నక్సల్స్ ఫ్రీ స్టేట్ అని ప్రకటన
- మావోయిస్ట్ ఉద్యమం కనుమరుగైందన్న నారాయణ



2లో

## ప్రధాని మోడీ ఫొటో పెడతాం: సిఎం రేవంత్



సన్న బియ్యం పథకానికి తమ కు ఏటా రూ. 14,500 కోట్ల రూ.ల వ్యయం అవుతున్నదని ముఖ్యమంత్రి తెలిపారు.

మిగతా2లో...

## కేరళలో ఎల్‌డిఎఫ్‌లో బిజెపి కుమ్మక్కు

**- ఎన్నికల ప్రచారంలో రాహుల్ ఆరోపణలు**



: కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ కు బీజేపీ పరోక్షంగా మద్దతిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో పోటీ యూడీఎఫ్‌కు, సీపీఎం-బీజేపీ కంబైన్‌కు మధ్యే జరగనుందని అన్నారు. పట్టంనాంతిట్ట జిల్లాలోని అదూర్‌లో

మిగతా2లో...


## ఆహార కల్తీ నియంత్రణ సరికొత్త వ్యవస్థ

- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది
- మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

: ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర

మిగతా2లో...





## మావోయిస్టు రహిత ప్రాంతంగా బస్తర్

**- అభివృద్ధి దిశగా ముందుకు..: కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 30:** బస్తర్‌ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మావోయిస్టు రహిత ప్రాంతంగా ప్రకటించారు. సోమవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. మావోయిస్టుల ఏరివేతకు మార్చి 31 డెడ్‌లైన్ అని తెలిపారు. బస్తర్‌లో ప్రస్తుతం మావోయిస్టులు లేరని,

మిగతా2లో...

## ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

- త్వరగా ఒప్పందం కుదర్చుకుని దారికి రావాలి
- మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్



2లో

## ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

- కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్
- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ



: సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో కేటీఆర్ సహా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పర్యటించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ కబ్జా బాధితులను పరామర్శించారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాడుతుందని బాధితులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వట్టనాగులపల్లిలో

మిగతా2లో...

## రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలపై మండలిలో ఆందోళన

**మంత్రి పొంగులేటి బర్తరఫ్‌కు బిఆర్ఎస్ సభ్యుల డిమాండ్**

**ఒకరోజు బిఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్**

**శాసనమండలిలో సభ్యుల సస్పెన్షన్ తొలిసారి**



: శాసన మండలిలో బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. అక్రమ మైనింగ్ అంశంలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాని.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. ఛైర్మన్ పోడియం వద్దకు వచ్చి ప్లకార్డులు పట్టుకుని ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఈ అంశంపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు శాసనసభలో సీఎం రేవంత్ స్పష్టం చేశారని చెప్పారు. మరోవైపు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా సభా కార్యక్రమాల నిర్వహణకు సహకరించాలని పదే పదే కోరారు. పెద్దల సభ గౌరవాన్ని కాపాడాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఆందోళన కొనసాగించడంతో వారిని సస్పెండ్ చేయాలని మంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో ఈరోజు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు.



## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి


**వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి**

**గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి**

**సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ**

హైదరాబాద్: జిఓ 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వన్ టైం రిలీఫ్ కింద ఉద్యోగులను స్వస్థలాలకు బదిలీ చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత అప్పటికే వివిధ ఉమ్మడి జిల్లాలు, జోన్‌లలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపాదికన కొత్త జిల్లాలు, జోన్‌లలో పోస్టింగ్స్ ఇచ్చారని గుర్తు చేశారు.

## బంగారు గని వద్ద దుండగుల దాడి..70 మంది మృతి



: దక్షిణ సూడాన్‌లో మారణహోమం చోటుచేసుకుంది. రాజధాని జుబాకు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న జెబెల్ ఇరాక్ బంగారు గని వద్ద గుర్తుతెలియని సాయుధ దుండగులు జరిపిన దాడిలో 70 మందికి పైగా పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య 85 వరకు ఉండొచ్చని కొన్ని అనధికారిక వర్గాలు చెబుతున్నాయి.ప్రాథమిక నివేదికల ప్రకారం, బంగారు గని వద్ద తలెత్తిన ఒక వివాదమే ఈ దాడికి కారణమైంది. సాయుధ దుండగులు

మిగతా2లో...

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక TGTEL/25/A0827

మంగళవారం 31, మార్చి 2026

# బంగారు గని వద్ద దుండగుల దాడి..70 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కసారిగా పౌరులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో అనేక మంది తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రాంతంలోని గనిపై దాడి జరగడం ఇది రెండోసారి.దక్షిణ సూడాన్‌లో 2018 శాంతి ఒప్పందం ఉల్లంఘనలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఇలాంటి హింసాత్మక ఘటనలు సాధారణమయ్యాయని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ గనుల తవ్వకాలు, స్థానిక యువత మధ్య విభేదాలు, వివిధ సాయుధ గ్రూపుల ఆధిపత్య పోరు వంటివి తరచూ ఘర్షణలకు దారితీస్తున్నాయి. ఈ ఘటనపై దక్షిణ సూడాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. అయితే, దేశ మైనింగ్ మంత్రిత్వ శాఖ ఈ దాడిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఈ దాడి దేశంలోని బలహీనమైన శాంతి ప్రక్రియకు మరింత విఘాతం కలిగిస్తుందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

---

(మొదటి పేజీ తరువాయి)

చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు..పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం పెట్టారన్నారు. పేదలందరికీ ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందుతాయని పేర్కొన్నారు ముఖ్యమంత్రి. వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని.. తాము మాత్రం వరి వేస్తే బోనస్ ఇస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 50 శాతం సీట్లు పెంచితే.. దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని పునరుద్ఘాటించారు. దక్షిణాదిపై ఉత్తరాది ఆధిపత్యం చెలాయిస్తుంది. దక్షిణాదిలో ఒక్క సీటు రాకున్నా కేంద్రంలో సర్కారు ఏర్పాటు చేసుకోవచ్చు. రాష్ట్రాల సీట్ల మధ్య అంతరం.. పెంచిన తర్వాత కూడా అంతే ఉండాలి. నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ పార్టీల సమస్య కాదు. 50శాతం సీట్ల పెంపుపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. పార్టీలకు అతీతంగా దక్షిణాదిలో కార్యాచరణ ఉండాలి. దేశంలో నియంత పాలన రాకూడదన్నదే నా ఉద్దేశం. దక్షిణాదికి బలం లేదని పెత్తనం చేస్తామంటే.. అది ఎంతకాలమో కొనసాగదు. జాతీయ పార్టీ అయినా, అన్యాయంపై మాట్లాడే స్వేచ్ఛ మాకుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని.. తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని ఆయన అంటున్నారని మండిపడ్డారు. మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజనను 50 శాతం సీట్ల ప్రాతిపదికన చేస్తే దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ దీనిపై వితండవాదం చేస్తున్నారని ఆగ్రహించారు. 50 శాతం సీట్లు పెంచుతున్నామని చెప్పినా ఉత్తర భారతదేశానికి నేరుగా లాభం జరుగుతుందని ఆరోపించారు. యోజకవర్గాల పునర్విభజన జరిగితే సౌత్ ఇండియా అవసరం లేకుండా పోతుందని విమర్శించారు. ఇది పార్టీల సమస్య కాదని.. సౌత్ ఇండియా, ప్రజా సమస్యని చెప్పుకొచ్చారు. దక్షిణ భారత ప్రజల కోసం లక్ష్మణ్ రాజీనామా చేయాలని.. సౌత్, నార్త్ మధ్య అంతరం పెరగొద్దని హితవుపలికారు. తిరుగులేని పాలన వస్తే నియంతృత్వం వస్తుందని.. అది జరగటానికి వీల్లేదని తేల్చి చెప్పారు. దేశంలో బ్రూటల్ మెజార్టీ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని.. బీజేపీ నాయకులు దీనిపై అవగాహన తెచ్చుకోవాలని హితవుపలికారు. బాగా పని చేస్తున్న సౌత్ ఇండియాను శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లే తనకు గుర్తింపు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు ప్రజలకు తెలిసేవి కాదని చెప్పారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకొంటున్నారని అందరూ అంటున్నారని.. ఆయన్ను గృహ నిర్బంధం చేశారని తనకు అనుమానంగా ఉందన్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు తాను కేరళలో ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తనకు, కేసీఆర్‌కు పోలిక లేదని.. ఎన్నికల వేళ తాము ఏం చెప్పామో అదే చేస్తున్నట్లు తేల్చి చెప్పారు.ఈ సందర్భంగా మీడియా సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. రూ.500ల గ్యాస్ విధానంలో ఎలాంటి మార్పులు లేవని గుడ్ న్యూస్ చెప్పారు. కేంద్రం సెస్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు రాష్ట్రానికి ఇవ్వడం లేదని.. 34 శాతం మాత్రమే తిరిగి ఇస్తున్నారని మండిపడ్డారు. కేంద్రానికి నచ్చిన రాష్ట్రాలకు మాత్రమే సెస్ ఇస్తున్నారని ఆరోపించారు.

---

# ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

(మొదటి పేజీ తరువాయి)

సతీశ్ షా కుటుంబం 60 ఏళ్లుగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రూ.1400 కోట్ల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని పేర్కొన్నారు. స్థలం ఇచ్చే ఉద్దేశం లేదని షా కుటుంబం తెలిపిందని అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డులో మీ ల్యాండ్ పోయిందని బెదిరింపులకు గురి చేశారని చెప్పారు. ఓ అక్రమార్కున్ని అడ్డం పెట్టుకుని 27 ఎకరాల భూమిని గుంజుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జేసీబీలతో వచ్చి గోశాలను కూల్చేశారని.. కాంపౌండ్ వాల్ కూలగొట్టారని అన్నారు. సతీశ్ షాను ఇక్కడే సజీవంగా పాతిపెడతామని బెదిరించారని తెలిపారు. అజీబుల్లా ఖాన్ అనే సిన్సియర్ అధికారి వీరికి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. తెల్లారే ఆ నిజాయితీ పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేశారని చెప్పారు. దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నామని వట్టినాగులపల్లి బాధితుడు సతీశ్ షా తెలిపారు. 1968 నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. పొంగులేటి హర్ష రెడ్డి వచ్చి రోడ్డుకు స్థలం ఇవ్వాలని అడిగాడని చెప్పారు. అందుకు నిరాకరించడంతో కొన్ని రోజుల తర్వాత శ్రీనివాస్ రెడ్డి వచ్చారని తెలిపారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా మా భూమి సర్వే చేయించాడని అన్నారు. సర్వే నోటీసులను హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొన్నారు. మా మనుషులపై దాడులు చేసి గూండాలు బెదిరించారని తెలిపారు. హైకోర్టుకు వెళ్తే పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశించిందని తెలిపారు.దీపావళి పండుగ తర్వాత నుంచి చాలా ఆందోళనగా ఉన్నామని వట్టినాగులపల్లి బాధితురాలు పల్లవి షా తెలిపారు. మా భూమి ఇవ్వాలని పొంగులేటి మనుషులు కోరినా నిరాకరించామని పేర్కొన్నారు. మేం 50 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం.. మాకు వేరే జాగా వద్దని అన్నామని చెప్పారు. అక్కడిస్తాం.. ఇక్కడిస్తామని మమ్మల్ని ఎంతో మభ్యపెట్టారని తెలిపారు. కిలోమీటర్ ఉన్న కాంపౌండ్ వాల్‌ను రాత్రికి రాత్రే కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని తెలిపారు. అదే రోజు రాత్రి 70 మంది గూండాలు వచ్చి మా గార్డులను బంధించారని వాపోయారు. మొబైల్స్ గుంజుకున్నారు. తెల్లవారుజాము వరకు నిర్బంధించారని తెలిపారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే నరికిపారేస్తామని బెదిరించారని అన్నారు. మాకు అండగా ఉన్న పోలీసు అధికారిని ట్రాన్స్‌ఫర్ చేయించారని తెలిపారు. మాకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు ఉన్నా కూడా విధ్వంసానికి పాల్పడ్డారని తెలిపారు.

---

# రాబోయే మూడేళ్లలో రూ.70 వేల కోట్లతో రోడ్లు: మంత్రి వెంకట్ రెడ్డి



: హ్యామ్ విధానంలో వేల కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభం గ్రామీణ రోడ్లతో రైతులు, విద్యార్థులు, రోగులకు మెరుగైన సౌకర్యాలు జాతీయ రహదారుల విస్తరణతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఊతం గేమ్ ఛేంజర్‌గా మారనున్న ట్రిబుల్ ఆర్, గ్రీన్ ఫీల్ ఎక్స్‌ప్రెస్‌వే అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మన తెలంగాణ/హైదరాబాద్: రాబోయే మూడు సంవత్సరాల్లో 70 వేల కోట్లతో రాష్ట్రంలోని రోడ్లను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి రోడ్లు భవనాలు శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, లక్ష్యాలు గురించి శాసన సభలో ప్రసంగించారు. మంచి రోడ్లు ఉంటే పెట్టుబడులు పెరిగి, ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని తెలిపారు. రోడ్ల అభివృద్ధి ద్వారా మార్కెట్ సౌకర్యాలు మెరుగుపడి, పరిశ్రమలు విస్తరించి సమగ్ర ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధితో రైతులకు పంట మార్కెట్‌కు చేరుకునే అవకాశాలు పెరుగుతాయని, విద్యార్థులు విద్య కోసం సులభంగా ప్రయాణిస్తారని, అత్యవసర పరిస్థితుల్లో రోగులు సమయానికి (గోల్డెన్ అవర్ లో) ఆసుపత్రులకు చేరుకోవచ్చని వివరించారు.యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. దేశంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న విషయం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. మోర్త్ లెక్కల ప్రకారం 2025 సంవత్సరంలో దేశవ్యాప్తంగా సుమారు 4.5 లక్షల రోడ్డు ప్రమాదాల్లో, 1.6 లక్షల మంది మరణించారని తెలిపారు. రాష్ట్రంలో 22,441 ప్రమాదాలు జరిగి 6,221 మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. డబ్బు పోతే తిరిగి వస్తుందని, ప్రాణం పోతే తిరిగి రాదని అన్నారు. రోజుకు సగటున 18 నుండి 20 మంది మరణించడం విచారకరమని, ఇందులో ఎక్కువగా యువతే ఉండటం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. ఇటీవల చేవేళ్ల–, మీర్జాగూడ వద్ద జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు యువతులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని మంత్రి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.

# సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

● అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్



: సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదేనని అన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఇవాళ్టి(మార్చి 30)తో సన్నబియ్యం పంపిణీ పథకానికి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా అసెంబ్లీ హాల్ లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కలిసి లంచ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్..సన్నబియ్యం ఆలోచన రేవంత్ రెడ్డిదేనన్నారు. రూ. 14560 కోట్లు సన్నబియ్యం కోసం ఖర్చుచేశామని చెప్పారు.ఇపుడు పేదలు కడుపునిండా తింటున్నారని అన్నారు. 86 శాతం మంది జనాలకు సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. ఫుడ్ సెక్యూరిటీ చట్టానికి తెలంగాణలో న్యాయం చేస్తామన్నారు. ఎంత ఖర్చైనా సన్నబియ్యం పథకం కొనసాగిస్తామని తెలిపారు. రైతుల ఖాతాలో ఇప్పటి వరకు రూ. 40 వేల కోట్లు వేశామన్నారు ఉత్తమ్. ధాన్యం డబ్బులు 48 గంటల్లో రైతులకువేస్తున్నామని తెలిపారు.అడిగిన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇస్తున్నామన్నారు.

# బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎన్నిక అనంతరం రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్యసభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. అలాగే బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా బీహార్ శాసనమండలికి రాజీనామా చేశారు. ఆయన కూడా మార్చి 16న రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన కూడా శాసనమండలికి రాజీనామా చేశారు. కాగా, 2005లో ఎన్‌డిఎ కూటమి తరపున నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక బిజెపికి మద్దతుగా, ఆ తర్వాత ఆ పార్టీని వ్యతిరేకిస్తూ మహాగట్బంధన్ వైపు మద్దుతుగా నిలిచి తన సిఎం పదవిని కాపాడుకున్నారు. 2013, 2017, 2022, 2024లో పార్టీలు మారుతూ సిఎంగా కొనసాగారు. 2025లో అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రికార్డు స్థాయిలో విజయం సాధించి పదవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు.

# మావోయిస్టు రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్..

మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు చెల్లూరి నారాయణ రావు సహా తొమ్మిది మంది ఎపి డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఎదుట లొంగిపోయారు. వీరి లొంగు బాటుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నక్సల్స్ రహిత రాష్ట్రంగా మారిందని డిజిపి ప్రకటించారు. లొంగిపో యిన మావోయిస్టుల నుంచి భారీగా ఆయుధ డంప్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. మావోయిస్టు పార్టీలో అత్యంత కీలక నేత, ఆంధ్రాఒడిశా సరిహద్దు (ఏవోబి) స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి చెల్లూరి నారాయణరావు అలియాస్ సోమన్న పోలీసుల ఎదుట లొంగిపోయారు.

# ప్రధాని మోడీ ఫొటో పెడతాం: సిఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తే.. పథకంపై ప్రధాని నరేంద్ర మోడీ ఫొటో పెడతామని సిఎం చెప్పారు. సోమవారం విలేకరులతో ఇష్టాగోష్టిగా సిఎం రేవంత్ మాట్లాడుతూ.. సన్న బియ్యం పథకం బాగుంది కాబట్టి దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టాలని తాను ఇదివరకే కేంద్రాన్ని కోరానని తెలిపారు. రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ సన్న బియ్యం పండించాలని రైతులను ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు ఐదు వందల రూపాయలు చెల్లిస్తున్నామని సిఎం అన్నారు. 3 కోట్ల 39 లక్షలు అంటే 86 శాతం తెలంగాణ ప్రజలు సన్న బియ్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆయన వివరించారు. భవిష్యత్తులో ఇది 90 శాతం కూడా కావచ్చని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# కేరళలో ఎల్‌డిఎఫ్‌లో బిజెపి కుమ్మక్కు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచారసభలో రాహుల్ మాట్లాడుతూ, కేరళలో యూడీఎఫ్ ఉండకూడదని బీజేపీ కోరుకుంటోందని, ఎందుకంటే కాంగ్రెస్‌కు మాత్రమే జాతీయ స్థాయిలో బీజేపీని సవాలు చేయగలిగే శక్తి ఉందనే విషయం వాళ్లకు బాగా తెలుసునని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో తాము సైద్ధాంతిక పోరాటం చేస్తున్నామని తెలిపారు. విపక్ష నేతలను సెంట్రల్ ఏజెన్సీలు టా÷–గ్గ్ం÷ట్ చేస్తున్నాయని, కానీ ఎల్డీఎఫ్‌పై మాత్రం ఎలాంటి దర్యాప్తులు ఉండవని రాహుల్ విమర్శించారు. తనపై 36 కేసులు పెట్టారని, 55 గంటల సేపు నిర్విరామంగా ప్రశ్నించారని అన్నారు. కేరళ సీఎం పినరయి విజయన్‌పై మాత్రం ఎలాంటి చర్యలు లేవన్నారు. ప్రధాని మోదీ ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని, కానీ ఇటీవల పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశాన్ని లేవనెత్తడం మరిచిపోయారని రాహుల్ విమర్శించారు. శబరిమలలోని అయ్యప్ప ఆలయంతో ముడిపడి ఉన్న అంశంపై మాట్లాడకపోవడం ద్వారా బీజేపీ, ఎల్డీఎఫ్ కలిసి పనిచేస్తున్నట్టు స్పష్టమవుతోందన్నారు. యూడీఎఫ్ అధికారంలోకి వస్తే ఆలయంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మావోయిస్టు రహిత ప్రాంతంగా బస్తర్


(మొదటి పేజీ తరువాయి)

మావోయిస్టు రహిత ప్రాంతంగా మారిందని వెల్లడించారు. బస్తర్‌లో ఆదివాసీలకు ప్రస్తుతం అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. అభివృద్ధి దిశగా బస్తర్ ప్రాంతం ముందుకెళ్తోందని తెలిపారు.అలాగే మావోయిస్టుల లొంగుబాటుకు నేడు (మంగళవారం) చివరి తేదీ అని, అభివృద్ధి లేదంటూ ఆయుధాలు పట్టుకోవడం సరికాదని అమిత్‌షా హితవు పలికారు. కాంగ్రెస్ హయాంలో విలీన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారని, వారి పాలనలోనే గిరిజన ప్రాంతాలు ఎందుకు అభివృద్ధి చెందలేదని ప్రశ్నించారు. గిరిజనులను 60ఏండ్లపాటు కాంగ్రెస్ విస్మరించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ నిర్వాకం వల్లే దేశంలో మావోయిస్టులు పెరిగారని, 12 రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని ఆయన మండిపడ్డారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని.. తమ వల్లే నక్సల్స్ విముక్త భారత్ సాధ్యమవుతోందని తెలిపారు.

# ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

:ఇరాన్ వీలైనంత త్వరగా ఒప్పందం చేసుకుని, హర్మూజ్ జలసంధిని తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. త్వరగా ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఇరాన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని తుడిచిపెట్టేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు పెట్టారు. ‘ఇరాన్‌లో మా సైనిక కార్యకలాపాలను ముగించేందుకు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాం. ఇప్పటివరకు గొప్ప పురోగతి లభించింది. కానీ.. ఏ కారణాలతోనైనా త్వరలో ఒప్పందం కుదరకపోతే, హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవకపోతే.. ఇరాన్‌లోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, చమురు క్షేత్రాలు, ఖర్గ్ ద్వీపాన్ని, అన్ని డీశాలినేషన్ ఎలాంట్లను పేల్చివేసి.. సర్వనాశనం చేస్తాం. 47 ఏళ్ల భయంకర పాలనలో ఇరాన్ చేతిలో హతమైన ఎంతోమంది అమెరికన్ సైనికులు, ఇతరుల పేరిట ప్రతీకారంగా ఈ దాడులు చేపడతాం‘ అని హెచ్చరించారు.

# కాంగ్రెస్ పాలనలోనూ ఉద్యమకారులకు న్యాయం జరగడం లేదు: విజయశాంతి ఆవేదన



ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమంపై శాసనమండలిలో ఎంఎల్‌సి విజయశాంతి తన గళం వినిపించారు. ప్రభుత్వంపై ఉన్న బాధ్యతను గుర్తు చేస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. సోమవారం ఆమె సభలో మాట్లాడుతూ తెలంగాణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులు లేకపోతే, ఇవాళ రాష్ట్రంలో ముఖ్యమంత్రులు కానీ, మంత్రులు కానీ ఉండేవారా? అని ప్రశ్నించారు. పదవుల కంటే ముందు వారి త్యాగాలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలతో పాటు వివిధ సందర్భాల్లో ఉద్యమకారులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం తప్పనిసరిగా నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక
మంగళవారం 31, మార్చి 2026

# ప్రజావాణికి 205 దరఖాస్తుల రాక

**- స్వీకరించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు**



**రాజన్న సిరిసిల్ల, మార్చి -- 30 ప్రజా దివాస్** ప్రజావాణిలో అర్జీలు కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వీకరించి.. పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 205 అర్జీలు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేశారు. రెవెన్యూ శాఖకు 82, గృహ నిర్మాణ శాఖకు 35, డీఆర్డీఓకు -- 30, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 9, ఉపాధి కల్పన అధికారికి -8, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి ఐదు చొప్పున, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి -- 4, జిల్లా పౌర సరఫరాల శాఖ, జిల్లా వైద్యాధికారి, నీటి పారుదల శాఖ అధికారికి మూడు చొప్పున, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, డీఎం ఆర్టీసీ సిరిసిల్ల, సెస్ ఎండీకి రెండు చొప్పున, చేనేత అండ్ జౌళి శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, బీసీ సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారి, అటవీ శాఖాధికారి, మైనింగ్ అధికారి, జిల్లా ఎక్సైజు అధికారి, యువజన అండ్ స్పోర్ట్స్ అధికారి, ఈడీఎం, జీజీహెచ్ సిరిసిల్ల, సబ్ రిజిస్ట్రార్ సిరిసిల్ల, మెప్మా కార్యాలయానికి ఒకటి చొప్పున రాగా.. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- జిల్లాలోని కేజీబీవీలు, టీజీఎంఎస్ రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లకు 20 ఫ్రీజర్ల పంపిణీ**



**రాజన్న సిరిసిల్ల, మార్చి -30 ప్రజా దివాస్**విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో జిల్లాలోని జిల్లాలోని 13 కేజీబీవీలు, ఏడు టీజీఎంఎస్ హాస్టళ్లకు కలిపి 20 ఫ్రీజర్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవతో సమకూర్చారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఆయా విద్యాలయాల బాధ్యులకు కలెక్టర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తుందని వివరించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని విద్యాలయాల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు, సేవలు అందిస్తుం దని తెలిపారు. జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్లకు గత చలికాలంలో విద్యార్థులకు వేడి నీళు అందించేందుకు ఇప్పటికే గీజర్లు అందించామని గుర్తు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించేందుకు ఫ్రీజ్లు ఈరోజు ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాలు, హాస్టళ్ల బాధ్యులకు అందజేసినట్లు తెలిపారు. ఈ ఫ్రీజర్ల ద్వారా విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు , కూరగాయలు పాడైపోకుండా నిల్వ చేసుకోవచ్చునీ, పాలు, ఆకు కూరలు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు స్వచ్ఛంగా అందించే అవకాశం ఉందని తెలిపారు. ొంసిడ ెన్షియల్ విద్యాలయాల్లో శుభ్రమైన ఆహారం పదార్థాలు అందించడం, వ్యర్థా ల నిర్వహణ, వసతి గృహాలలో మెరుగైన జీవన వాతావరణం కల్పించడానికి ఇన్సినరేటర్, వంటపాత్రలు కూడా గతంలో అందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీవో పద్మజ, స్పెషల్ ఆఫీసర్స్, కేర్ టేకర్స్ తదితరులు పాల్గొన్నారు.

# మెనూ కచ్చితంగా పాటించాలి : కలెక్టర్ గరిమ అగ్రవాల్

**- ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఈఎంఆర్ఎస్ విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ**



**ఎల్లారెడ్డిపేట, మార్చి - 30 ప్రజా దివాస్** విద్యార్థులకు మెనూ కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన భోజనం ఇవ్వాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్



(ఈఎంఆర్ఎస్) విద్యాలయంలో కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలు, తరగతి, వసతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవు తుండగా, కలెక్టర్ వారితో మాట్లాడి.. పలు సూచనలు చేశారు. విద్యార్థులందరూ చదువు పై శ్రద్ధ పెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

## విద్యుత్ షాక్ తో మాజీ జనశక్తి నాయకులు రైతు జంగం అంజయ్య ఆకస్మిక మృతి...
## గ్రామంలో విషాదఛాయలు

**వీర్నపల్లి మార్చి 30 ప్రజా దివాస్**విద్యుత్ ఘాతంతో మృతి చెందిన ఘటన సోమవారం వీర్నపల్లి మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వీర్నపల్లి అంబేద్కర్ కాలనీ కి చెందిన జంగం అంజయ్య (54) ప్రజా ఉద్యమంలో ప్రజల కోసం ముందుండి నడిచిన జనశక్తి మాజీ నాయకులు ప్రస్తుత సిపిఐ రైతు సంఘ కార్యదర్శి జంగమయ్య విద్యుత్ షాక్ తో మృతి చెందడం తో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రజల కోసం, రైతుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని, ఆయన సేవలు, ఆలోచనలు నిబద్ధత సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, అలాంటి నాయకున్ని కోల్పోవడం గ్రామానికి తీరని లోటు అని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. జీవితం అంతా ప్రజల కోసమే.. ప్రజా ఉద్యమం కోసమే ఉండి రైతుగా సిపిఐ విభాగ కార్యదర్శిగా జీవనం కొనసాగిస్తూ ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం పంట పొలానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ షాకు గురైనాడు. అటుగా వెళు తున్న రైతు లు108 అంబులె న్స్ కు సమాచారం ఇవ్వగా అప్పటికి అంజ య్య మరణించాడనీ సిబ్బంది నిర్ధారించారు. ఆకస్మితంగా మరణించిన జంగం అంజయ్యకు భార్య పుష్పలత, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





## పోతుగల్ గ్రామంలో సిఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ యాదమ్మ-శ్రీనివాస్




**ముస్తాబాద్ /మార్చ్ 30 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో సిఎంర్ఫ్ చెక్కులను లబ్ధిదారులు అయిన చేపూరి సందీప్ 51000/- తౌటి ఎల్లయ్య 24000/ నాంపల్లి కల్పన 24000/ దేశెట్టి వెంకట రాములు 22000/జంగా లక్ష్మీనారాయణ వార్డు మెంబర్ 32500 రూపాయలు,మొత్తం 153500 రూపాయల చెక్కులను ఈ రోజు లబ్ధిదారులకు అందచేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ-శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అన్నమేని రాజు మరియు కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ పెద్దిగారి శ్రీనివాస్, ముస్తాబాద్ మాజీ సర్పంచ్ ఓరగంటి తిరుపతి,ఎన్ ఆర్ ఐ సెల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, మరియు మెరుగు కిరణ్, మామిండ్ల ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కేసుగాని చంద్రమౌళి,ఆది శేఖర్ రాయమల్లు,హరిబాబు, మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

**గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 36 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**



**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 30 ప్రజా దివాస్** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.
ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.....
ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## నూతన గ్రోమర్ మండల కేంద్రం ప్రారంభం....



**వీర్నపల్లి మార్చి 30 (ప్రజా దివాస్):** వీర్నపల్లి మండల కేంద్రంలో గ్రోమార్ నూతన కేంద్రం ను సెస్ డైరెక్టర్ మల్లేశం, మాజి ఎంపీటీసీ అరుణ్ కుమార్, ఉప సర్పంచ్ నరేష్ గ్రోమార్ సెంటర్ నిర్వాహకులతో కలిసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రైతులు గ్రోమార్ సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సెస్ డైరెక్టర్ మల్లేశం, మాజీ ఎంపిటిసి అరుణ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రోమర్ సంస్థ అర్ ఎస్ ఎం లు రైతులకు డ్రోన్ సేవలు, భూసార పరీక్షలు , ఆధునిక వ్యవసాయ సేవల గురించి వివరించారు. ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో ఉపయోగించడం వల్ల రైతులకు మంచి లాభాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్ ఎస్ ఎం లు దేవయ్య, అశోక్, అనిల్, వైకుంఠం, ప్రమోద్, వీర్నపల్లి గ్రోమార్ సెంటర్ నిర్వాహకులు మహిపాల్, దినకర్, సాయి మాధవ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ డిప్యూటీ ఈఓగా డి. భాస్కర్ శర్మ నియామకం




**వేములవాడ/ప్రజాదివాస్ మార్చి 30** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం డిప్యూటీ ఈఓగా డి. భాస్కర్ శర్మ నియమితులయ్యారు. ప్రస్తుతం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో డిప్యూటీ ఈఓగా విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్ శర్మను రాజన్న ఆలయానికి బదిలీ చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. వేములవాడ ఆలయ అభివృద్ధిలో భాగంగా ఈ కీలక మార్పు జరిగినట్లు తెలుస్తోంది. ఉత్తర్వులు అందుకున్న భాస్కర్ శర్మ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

# వేములవాడటౌన్: పాత కక్షతో విద్యార్థినిపై వేధింపులు..

### ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు ఫిర్యాదు



**వేములవాడ ప్రజాదివాస్ మార్చి 30**గతంలో తాను పనిచేసిన పాఠశాల విద్యార్థిని పట్ల అనుచితంగా వ్యవహరించి, ఆమె వ్యక్తిత్వ బంగానికి పాల్పడ్డారంటూ ఓ ప్రిన్సిపల్‌పై సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. వేములవాడకు చెందిన వెల్దండి సదానందం తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బాధితుడి కథనం ప్రకారం.. సదానందం కుమార్తె 2022లో హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సమయంలో, అప్పటి ప్రిన్సిపల్ శ్రీదేవి పనితీరుపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరిపిన అధికారులు ప్రిన్సిపల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న ప్రిన్సిపల్.. ఆ విద్యార్థినిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడినట్లు సదానందం ఆరోపించారు.విద్యార్థిని వ్యక్తిగతంగా రాసుకున్న డైరీని దొంగిలించి, అందులోని విషయాలను వక్రీకరించి సామాజికంగా ఆమె పరువు తీసేలా అసత్య ప్రచారాలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా, సదరు ప్రిన్సిపల్ కంప్యూటర్ ఆపరేటర్‌తో మాట్లాడిన కొన్ని ఆడియో రికార్డులను కూడా కలెక్టర్‌కు ఆధారాలుగా అందజేశారు. మైనర్ అని కూడా చూడకుండా తన కుమార్తెపై దుష్ప్రచారం చేస్తూ మానసిక క్షోభకు గురిచేసిన ప్రిన్సిపల్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఆయన వేడుకున్నారు.

సహారా బాధితులకు బేషరతుగా నగదు చెల్లించాలి

# బోయినిపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా





**బోయినిపల్లి మండలం/ప్రజాదివాస్ మార్చి 30** సహారా ఇండియా గ్రూప్ కంపెనీలో డబ్బులు డిపాజిట్ చేసిన బాధితులందరికీ ఎలాంటి షరతులు లేకుండా వెంటనే నగదు చెల్లించాలని సీపీఎం డిమాండ్ చేసింది. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యా లయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ మాట్లాడుతూ.. అది ,క వడ్డీ వస్తుందని, భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడతాయని సామాన్య ప్రజలు సహారాలో పొదుపు చేసుకున్నారని తెలిపారు. కంపెనీ అధినేత సుబ్రత రాయ్ మరణం తర్వాత డిపాజిట్ గడువు ముగిసినా బాధితులకు డబ్బులు అందకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏడాదిలోపు నగదు చెల్లించాల్సి ఉన్నా, కేంద్ర ప్రభుత్వం అనేక నిబంధనలు, షరతులు పెడుతూ బాధితులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. డిపాజిటర్లు కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బేషరతుగా నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచ అశోక్, నాయకులు కుడుకల గిరిబాబు, దూస జనార్ధన్, బాధితులు వాసాల నరసయ్య, విజయ, సత్తవ్వ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# 2న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక గ్రామ,వార్డు సభలు

- పకడ్బందీగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి
- షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం నిర్వహించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక పై జిల్లాలోని మండల, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో ఐడీఓసీ నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్




**రాజన్న సిరిసిల్ల, మార్చి -30 ప్రజా దివాస్**ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా వచ్చేనెల (ఏప్రిల్) 2వ తేదీన గ్రామ పంచాయతీ ల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వచ్చే నెల (ఏప్రిల్) 2వ తేదీన గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణపై జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ పరిధిలో వార్డు సభలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి గ్రామసభ, వార్డు సభకు వివిధ మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రం రూపొందించాలని, దానిని కార్యక్రమంలో అందజేయాలని తెలిపారు.ప్రగతి ప్రణాళిక కోసం గ్రామ స్థాయి, వార్డు స్థాయి అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించాలని, గ్రామం, వార్డులో ఉన్న సమస్యలను గుర్తించాలని, పరిష్కారాలపై చర్చించాలని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ఇప్పటిదాకా చేపట్టిన పనులు, ఎన్ని పెండింగ్ ఫైళ్లు పరిష్కరించారో వివరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.సభలకు సర్పంచ్, మున్సిపాలిటీలో చైర్ పర్సన్, ఉప సర్పంచ్, వైస్ చైర్ పర్సన్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శిసంబంధిత శాఖల అధికారులు, గ్రామ పెద్దలు స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతరైతులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులను, వివిధ పథకాల లబ్ధిదారులను ఆహ్వానించాలని ఆదేశించారు. అలాగే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.కార్యక్రమ వేదికలు ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల్లో పాఠశాల / పంచాయతీ భవన్ / బహిరంగ ప్రదేశం / ఇతర అనువైన వేదిక వద్ద ఏప్రిల్ 2వ తేదీన ఉదయం 10:00 గంటలకు నిర్వహించాలని ఆదేశించారు. మైక్, స్పీకర్లు ప్రదర్శన కోసం స్క్రీన్, ప్రొజెక్టర్ ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.గ్రామ సభ, వార్డు సభలు తెలంగాణ రాష్ట్ర గీతం (జయ జయహే తెలంగాణ) సర్పంచ్ స్వాగతోపన్యాసం, పరిచయం అలాగే సీఎం గారి సందేశం వినిపించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న రకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల వివరాలు, సాధించిన విజయాలపై శాఖల ద్వారా సమాచారం ఇవ్వాలని, లబ్ధిదారుల పేర్లను చదవాలని, లబ్ధిదారుల అభిప్రాయాలు, అనుభవాలు చెపాల్లని తెలిపారు. గ్రామ సమస్యలు, వార్డ్ సమస్యలపై చర్చించాలని, భవిష్యత్లో చేపట్టనున్న పనులపై తీర్మానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో త్వరలో అమలు చేయనున్న అల్పాహార పథకం (ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు), ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా పథకం, మధ్యాహ్న భోజన పథకం ఇంటర్మీడియట్ వరకు విస్తరణ, ఇంటర్మీడియట్ చదివే దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు, పంటల వైవిధ్యీకరణ, ప్రకృతి సేంద్రీయ వ్యవసాయంపై వివరించాలని కలెక్టర్ తెలిపారు.అధికారులకు అభినందనజిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేస్తున్న హౌసింగ్, ఆయా శాఖల అధికారులను కలెక్టర్ అభినందించారు. త్వరలో మెగా హౌసింగ్ గృహ ప్రవేశాలు నిర్వహిస్తామని వివరించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయా శాఖల అధికారులు షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అందరి భాగస్వామ్యం, ఆయా శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, సీపీఓ శ్రీనివాసాచారి, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, మైనింగ్ అధికారి క్రాంతి కుమార్, సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, మత్స్య శాఖ అధికారి సౌజన్య, జిల్లా వైద్యాధికారి రజిత తదితరులు పాల్గొన్నారు.

# గృహ సముదాయాల బ్లాక్‌లు గుర్తించి సీఎంఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి

- డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతీ హోలికేరి
- హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్





**రాజన్న సిరిసిల్ల, మార్చి 30: ప్రజా దివాస్**

జనగణన-2027కు సంబంధించి గృహ సముదాయాల బ్లాక్‌లు (హౌజ్ లిస్టింగ్ బ్లాక్‌లు) గుర్తించి సీ ఎం ఎస్ ఎస్ (సెన్సస్ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) పోర్టల్‌లో నమోదు చేయాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతీ హోలికేరి ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతీ హోలికేరి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతీ హోలికేరి మాట్లాడుతూ.. మే 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జనగణన-2027 కోసం అన్ని జిల్లాల్లో 10 శాతం అధికంగా ఎన్యుమేటర్లు,సూపర్వైజర్లను గుర్తించి నియమించాలని ఆదేశించారు. నియమితులైన సిబ్బంది వివరాలను సీఎంఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు.జనాభా ఆధారంగా రెవెన్యూ గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లను ముందుగా రూపొందించి, వాటి ప్రకారం హౌజ్ లిస్టింగ్ బ్లాక్‌లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇళ్ల వివరాలను సేకరించి హౌజ్ లిస్టింగ్ చేయాలని, పోర్టల్ ద్వారా ఈ ప్రక్రియపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి హౌజ్ లిస్టింగ్ బ్లాక్‌లో 700 నుంచి 850 వరకు జనాభా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హౌజ్ లిస్టింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు సమావేశంలో సీపీఓ శ్రీనివాసాచారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాణి విద్యాలయంలో 'రెయిన్ డ్యాన్స్' సందడి: హుషారుగా చిందులేసిన విద్యార్థులు







**వేములవాడ ప్రజాదివాస్ మార్చి 30**వేములవాడలో హైదరాబాద్ రేంజ్ హంగామా.. వాణి విద్యాలయం స్కూల్లో వినూత్న వేడుకలుపుస్తకాల ప్రపంచం నుంచి కాసేపు బయటపడి, చల్లని చినుకుల మధ్య విద్యార్థులు కేరింతలు కొట్టారు. వేములవాడలోని వాణి విద్యాలయంలో నిర్వహించిన 'రెయిన్ డ్యాన్స్' కార్యక్రమం పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా నీటి తుంపరల మధ్య సంగీతానికి అనుగుణంగా నృత్యాలు చేస్తూ తన్మయత్వం చెందారు. సాధారణంగా హైదరాబాద్ వంటి మహానగరాల్లో, పెద్ద పెద్ద వాటర్ పార్కుల్లో మాత్రమే కనిపించే ఇలాంటి వినూత్న కార్యక్రమాలను వేములవాడలోని తమ విద్యాల యంలోనే ఏర్పాటు చేయడం విశేషం. పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా కృత్రిమ వర్షపు వ్యవస్థను ఏర్పాటు చేయడంతో, విద్యార్థులు ఎండ వేడిని మర్చిపోయి వర్షంలో తడుస్తూ చిందులేశారు. చదువుతో పాటు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని, వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ఈ వేడుకను నిర్వహించారు.తమ పిల్లలు ఇంత ఉత్సాహంగా వేడుకను ఆస్వాదించడం చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు.వేములవాడ వంటి పట్టణంలో కూడా అత్యాధు నిక హంగులతో, వినూత్న రీతిలో పిల్లలకు వినోదాన్ని అందించడం పట్ల పాం॰శాల కరస్పాండెంట్ బద్దం అనంతరెడ్డిని వారు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడ తాయని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృం దం, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంజన్న సన్నిధిలో జరిగిన ఈ వినూత్న వేడుక స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.